క్లుప్తంగా

నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల కేంద్రంలో పెద్ద లక్ష్మమ్మవ్వ ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. చాలా కాలంగా స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న ఆలయం శిథిలమవుతుండటంతో గ్రామ పెద్దలు ఆలయాన్ని పునర్నిర్మించాలని పురాతన ఆలయాన్ని తొలగించారు. నూతన ఆలయ నిర్మాణానికి గ్రామ పెద్దలు ఆర్.రామలింగారెడ్డి, అనసూయమ్మ, పురోహితులు పంపాపతి స్వామి, పెద్ద లక్ష్మమ్మవ్వ దేవి ఆలయ అర్చకులు విశ్వబ్రాహ్మణ నరసింహాచారి ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

మంత్రాలయానికి చేరిన బైక్ యాత్ర


రాజును సన్మానిస్తున్న సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య

మంత్రాలయం: వచ్చే ఎన్నికల్లో మరోసారీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టాలని కోరుతూ చేపట్టిన బైక్ యాత్ర గురువారం మంత్రాలయం చేరుకుంది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం యల్లంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన రాజు మాట్లాడుతూ గత నెల 14న నెల్లూరు జిల్లా నుంచి చేపట్టిన బైక్ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో సాగుతుందన్నారు. 44 నియోజకవర్గాలు పూర్తి చేసుకుని ఆదోని, ఎమ్మిగనూరు మీదుగా మంత్రాలయం నియోజకవర్గంలోని అడుగుపెట్టానని చెప్పారు. బైక్ యాత్రకు గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య ఆధ్వర్యంలో స్వాగతం పలికి రాజును సన్మానించారు. పత్తికొండ, డోన్, కోడుమూరు, కర్నూల్, పాణ్యం, శ్రీశైలం, నంద్యాల,ఆళ్లగడ్డ మీదుగా యాత్ర సాగుతుందని రాజు వివరించారు.

ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం

ఆదోని అర్బన్: ఆవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్యవైశ్య పఠనాలయంలో చిన్నపిల్లలకు వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. అబాకస్ వేదిక్ మ్యాథ్స్, చెస్ ట్రినింగ్, మెహిందీ డిజైనింగ్, కాలిగ్రఫీ, పేపర్ ఆర్ట్, మ్యూజిక్ తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నా రు. ఆవోపా అధ్యక్షుడు శ్రీనాథ్, పఠనాలయం అధ్యక్ష కార్యదర్శులు మురళీ, సనత్‌కుమార్, అశోక్ శిక్షణను ప్రారంభించి మాట్లాడుతూ చి న్నారులు శిక్షణలో పాల్గొనాలని కోరారు. స భ్యులు శ్రీధర్, ప్రతాప్, రాంప్రసాద్, కవితశ్రీ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామ చెరువులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సృజన్ బాబు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వీరేష్, ధర్మరాజు రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని సెబ్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. అయితే మొదటి సారిగా పట్టుబడడంతో ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.10వేల చొప్పున జరిమానా విధించి వదిలేసినట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన హనుమంతుకు సీఆర్పీ చేస్తున్న దృశ్యం

ఆస్పరి: ఆస్పరి సమీపంలో గురువారం స్కూటర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు మండలంలోని శంకరబండ గ్రామానికి చెందిన హనుమంతు పని నిమిత్తం ఆస్పరికి వచ్చారు. పని ముగించుకుని స్వగ్రామమైన శంకరబండకు స్కూటర్‌పై వెళ్తుండగా ఆదోని నుంచి ఆస్పరి వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో ఒక కాలు తెగిపడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో ఆటోలో చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

ఆలూరు రూరల్/హాలహర్వి: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైంది. వివరాలు.. హాలహర్వి మండలం పచ్చాపల్లికి చెందిన రైతు షేక్ ఆలం బాషా ఇటీవలే రూ.65 వేలు వెచ్చించి ఎద్దుల కోసం జొన్నసొప్ప కొనుగోలు చేశాడు. గురువారం తెల్లవారుజామున గడ్డివాముకు నిప్పంటుకోవడంతో ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోపు గడ్డివాము పూర్తిగా కాలిపోయింది.


హెచ్.మురవణిలో పడిపోయిన చెట్టు,


బాపులదొడ్డి సమీపంలో విరిగిన విద్యుత్ స్తంభం

ఈదురు గాలుల బీభత్సం

పెద్దకడబూరు: మండలంలో గురువారం ఈదురు గాలులు, వర్షం బీభత్సానికి మండలంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. హెచ్.మురవణి గ్రామ పొలాల్లో చెట్టు వేర్లతో సహా నేలకొరిగింది. పలు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. గవిగట్టు, బాపులదొడ్డి, పీకలబెట్ట, హులికన్వి, బసలదొడ్డి, తదితర గ్రామాల్లో 15విద్యుత్ స్తంభాలకు పైగా విరిగిపోయాయి. విద్యుత్ ఏఈ నాగవేంద్రం సిబ్బందితో విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు.


కూలిన విద్యుత్ స్తంభం

కోసిగి: మండలంలో ఈదురు గాలులు, వర్షం బీభత్సం సృష్టించింది. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భారీ ఉరుములు, మెరుపుల శబ్దంతో వడగండ్ల వర్షం కురిసింది. ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈదురు గాలులకు కోసిగి, సాతనూరు, పీకల బెట్ట, అగసనూరు, మూగలదొడ్డి, చిర్తనకల్లు, దుద్ది, చింతకుంట గ్రామాల్లో దాదాపు 30కి పైగా విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలవాలాయి. చెట్లు విద్యుత్ తీగలపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు రూ.5లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని విద్యుత్ అధికారులు తెలిపారు. వర్షంతో కోసిగిలోని ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయ ఆవరణ ముందు భాగంలో రోడ్లపై నిల్వ ఉండి పోయి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


వడగండ్లు పడిన దృశ్యం

భారీ వర్షం

కౌతాళం: మండలంలో గురువారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. గురువారం సాయంత్రం మండలంలో ఈదురుగాలులు, వడగండ్ల వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ముఖ్యంగా ఉప్పరహాల్-రూడూరు గ్రామాలు, కౌతాళం-ఉప్పరహాల్ గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాలు అధికంగా పడిపోయాయి. 50 విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సుమారు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని ఏఈ నర్సప్ప తెలిపారు.

9న సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రవేశ పరీక్ష

కర్నూలు కల్చరల్: కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 9న సిల్వర్ సెట్ – 2023 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ తెలిపారు.

వైభవంగా ఫక్కీర్ల ఊరేగింపు


దర్గాను పూలతో అలంకరించిన దృశ్యం

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగస్వామి ఉరుసులో భాగంగా గురువారం సాయంత్రం ఫక్కీర్ల ఊరేగింపు వైభవంగా సాగింది. గంధం రోజు సాయంత్రం ఫక్కీర్లందరూ పీర్లకట్ట వద్దకు చేరుతారు. వారిని దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ వారి శిష్యరిక బృందం వెళ్లి తీసుకోని రావాలనేది ఇక్కడి ఆచారం. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫక్కీర్ల ఊరేగింపు సందర్భంగా వారు చేసిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతాలన్ని కిటకిటలాడాయి. రాత్రి నిర్వహించిన ఖవ్వాలీ పోటీలు అలరించాయి. దర్గాలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.


దర్గా వద్దకు ఫక్కీర్లను తీసుకొస్తున్న దృశ్యం


ఫక్కీర్ల విన్యాసాలు

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

నందవరం: మండల పరిధిలోని కనకవీడు పేట గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. గురువారం గ్రామంలో వాల్మీకి పెద్దలు, వేద పండిత శ్రీకృష్ణ స్వామి నేతృత్వంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ముందుగా మహర్షి విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం రామప్ప దేవాలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. ముఖ్యఅతిథులు వీజీఆర్ కొండయ్య, యాపిలయ్య హాజరై మాట్లాడుతూ.. వాల్మీకి సోదరులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. ఎస్టీ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. వాల్మీకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి, నేటి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. వాల్మీకి నాయకులు కృష్ణతేజ నాయుడు, ఈరన్న, రంగన్న, మధుబాబు పాల్గొన్నారు.


కే.పేట గ్రామంలో ప్రతిష్ఠించిన వాల్మీకి విగ్రహం

గ్రూపు-1 మెయిన్స్‌ను పకడ్బందీగా నిర్వహించండి

కర్నూలు(సెంట్రల్): ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఆర్వో అనురాధ తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో పరీక్షల సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో కేవీ సుబ్బారెడ్డి కాలేజీలో పరీక్షా కేంద్రం ఉంటుందన్నారు. 545 మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ ద్వారా మెయిన్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు. పాత వాహనాల వేలం పాటకు మంచి స్పందన వచ్చిటన్లు ఇన్‌చార్జ్ డీఆర్వో అనురాధ తెలిపారు. 9 వాహనాలను వేలంలో ఉంచగా 20 మంది హాజరై నిబంధనల ప్రకారం పాటలో పాల్గొన్నట్లు ఆమె వివరించారు.


మాట్లాడుతున్న అనురాధ

ఆటో బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం


మృతిచెందిన ఏకాంతేశ్వర్

ఆలూరు: దేవనకొండ మండల కేంద్రం నుంచి జిల్లెడుబుడక గ్రామానికి ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడి డ్రైవర్ ఏకాంతేశ్వర్ (32) అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే జిల్లెడుబుడక గ్రామం నుంచి మిత్రుడు నరసింహ నాయుడును హైదరాబాద్ బస్సు ఎక్కించేందుకు మరొక మిత్రుడు వీరేష్ నాయుడుతో కలిసి అశోక్ లేలాండ్ గూడ్స్ ఆటో ఏపీ 39 బి 6415లో దేవనకొండకు బయలుదేరారు. వీరేష్ నాయుడు బస్సు ఎక్కిన తర్వాత జిల్లెడుబుడకలకు తిరుగు ప్రయాణంలో గద్దెరాళ్ల స్టేజ్ వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డం రావడంతో తప్పించబోయి కుడి వైపుకు తిప్పగా ఆటో బోల్తా పడింది. డ్రైవర్ ఏకాంతేశ్వర్ తలకు బలమైన గాయం తగలడంతో రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందాడు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


రాజా మహమ్మద్ ఫయాజ్

హొళగుంద: మండలంలోని రివా ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న బీసీ కాలనీకి చెందిన రాజా మహమ్మద్ ఫయాజ్ జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికై నట్లు గురువారం కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ముంబైలో జరిగే పోటీలో ఫయాజ్ పాల్గొంటాడని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఫయాజ్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు పదోన్నతి

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న దాస నాయక్ ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. గతంలో ఎంపీడీఓగా పని చేసిన మేరి కొత్తపల్లికి బదిలీ కావడంతో దాసనాయక్ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. ఎంపీడీఓగా ప్రమోషన్ కల్పించి అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు.

ఎంపీపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్ : మహిళా రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఉపాధ్యక్షుడు పి.ఈరన్న, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు భరత్, శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై దేశ గౌరవాన్ని చాటిన మహిళా క్రీడాకారుల పట్ల వేధింపులకు పాల్పడిన వారిని కేంద్ర ప్రభుత్వం కాపాడటం దుర్మార్గమన్నారు. క్రీడాకారిణులు 36 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎంపీని అరెస్టు చేసి రెజ్లర్లకు న్యాయం చేయాలని కోరారు.


ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పోలీసులు పట్టించుకోవడం లేదు

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేశారని, మూడు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాలిక తల్లిదండ్రులు అయ్యమ్మ, హనుమంతరెడ్డి ఆరోపించారు. స్థానిక వీహెచ్ఎస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గత నెల 30న సాయంత్రం తమ కుమార్తె నాగవేణి మాత్రల కోసమని మందుల దుకాణానికి వెళ్లిందని, ఆలస్యం కావడంతో గ్రామంలో వెదికినా ఆచూకీ లభించకపోవడంతో రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. తమ కుమార్తెను ఇంటి ఎదురుగా ఉన్న వీరేష్ కిడ్నాప్ చేశాడని ఆరోపించారు. ఇందుకు వీరేష్‌కు మరో ఐదుగురు సహకరించారని చెప్పారు. మూడు రోజులైనా కుమార్తె ఆచూకీ తెలియకపోవడంతో భయాందోళన చెందుతున్నామన్నారు. ప్రతిరోజూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయంపై ఎస్‌ఐ రమేష్‌బాబును వివరణ కోరాగా..31న మిస్సింగ్ కేసు నమోదు చేశామని, విచారణ చేసి త్వరలోనే బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తామని చెప్పారు.



తమ కుమార్తెను రక్షించాలంటున్న తల్లిదండ్రులు

దోమకాటుకు తెరతో అడ్డుకట్ట


అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

మద్దికెర: దోమకాటు వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముందని, రాత్రి నిద్రించే సమయంలో దోమతెరలు వాడి దోమకాటుకు గురికాకుండా రక్షణ పొందాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. గురువారం జాతీయ కీటక జనిత వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మద్దికెరలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి డీడీటీ మందులు పిచికారీ చేయించడమే గాకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఖాళీ టైర్లు, కుండీలు, తొట్టెలు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి శుభ్రం చేయాలన్నారు. ఇళ్లలో వేపాకు పొగ వేసుకోవడం వల్ల దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. సర్పంచ్ ఆంజనేయులు, వైద్యులు నగేష్, సీహెచ్ఓ నిరంజన్, సిబ్బంది వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ప్రకాష్, రాజేంద్ర, ఏఎస్ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు రెండు రోజుల ముందే చేరుకోవాలి

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్రికులు రెండు రోజుల ముందే గుంటూరు వద్ద ఉన్న హజ్ క్యాంపునకు చేరుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లైట్ తేదీ కంటే రెండు రోజుల ముందు గుంటూరు సమీపంలోని హైవే వద్ద ఉన్న నంబూరు జామియా సిరాజుల్ ఉలూం మదరసాకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి విజయవాడ ఎంబర్కేషన్ (గన్నవరం విమానాశ్రయం) నుంచి విమానాల ద్వారా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.

ఆర్‌యూలో ఏడుగురి సస్పెన్షన్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఏడుగురి బోధనేతర సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. కొందరు విద్యార్హత, పుట్టిన తేదీ నకిలీ ధ్రువప్రతాలు సమర్పించి ఉద్యోగాలు పొందినట్లు యూనివర్సిటీ దృష్టికి వచ్చింది. వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ధ్రువీకరించడానికి విశ్వవిద్యాలయం నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. సర్టిఫికెట్ల వాస్తవికతకు సంబంధించి అధికారుల నుంచి వచ్చిన లేఖలను ధ్రువీకరించిన తర్వాత కమిటీ ఆరోపణల నివేదికను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ముందు సమర్పించింది. కమిటీ నివేదికను ఆమోదించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏడుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు గురువారం విశ్వవిద్యాలయం అధికార యంత్రాంగం తెలిపింది.

అప్పు చెల్లించమన్నందుకు దాడి

ఆదోని అర్బన్: అప్పు చెల్లించమన్నందుకు ఓ మహిళపై ఐదుగురు దాడికి పాల్పడిన ఘటన కపటి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఇస్వీ పోలీసులు, బాధితురాలు గురువారం తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన గోవిందరాజు, పెద్దబజారితో పాటు మరో ముగ్గురికి తులసమ్మ డబ్బులు అప్పుగా ఇచ్చింది. తన సొమ్ము ఇవ్వాలని అడగడంతో వారు ఆమెపై దాడి చేశారు. గాయపడిన ఆమెను బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కోసిగి: మండలంలోని పెద్దభూంపల్లి గ్రామంలో గట్టు అంజినయ్యపై అదే గ్రామానికి చెందిన పెద్ద హనుమంతు రెడ్డి వర్గీయులు దాడికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి 10గంటల సమయంలో హనుమంతు రెడ్డి ట్రాక్టర్లతో అనుమతి లేకుండా గరుసును గ్రామంలోకి తరలిస్తుండగా అంజినయ్య అడ్డుకున్నాడు. గురువారం ఉదయం అంజినయ్య గ్రామంలో గుడి వద్ద కూర్చుని ఉండగా హనుమంతు రెడ్డి వర్గీయులు దుర్భాషలాడుతూ దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు అంజినయ్యతో పాటు ఐదుగురిపై, హనుమంతు రెడ్డితో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని మదిరె క్రాస్ రోడ్డు వద్ద పర్వతాపురం గ్రామానికి చెందిన పి.షెక్షావలి మోటార్ సైకిల్‌పై కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా దాడి చేసి అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు. ఎనిమిది బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సెబ్ ఎస్‌ఐలు శివప్రసాద్,మధుసూదన్‌రెడ్డి,కానిస్టేబుళ్లుసోమేష్,సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

ఆదోనిఅర్బన్: మండలంలోని కపటి గ్రామానికి చెందిన ప్రభుకు బుధవారం రాత్రి పొలంలో పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే బంధువులు ఆయనను ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పొలం పనులు పూర్తి చేసుకొని తిరిగి వస్తుండగా పాము కరిచిందని, దీంతో అక్కడే అస్వస్థతకు గురికావడంతో ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని బాధితుడు చెప్పారు.

ఎల్లార్తి దర్గాల నిర్వహణకు టెండర్



హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల నిర్వహణ కోసం గురువారం విజయవాడ స్టేట్ వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీల్డ్ టెండర్లను ఓపెన్ చేయగా రూ.2.50 కోట్లకు దక్కించుకున్నట్లు ఎల్లార్తి గ్రామానికి చెందిన బోయ లక్ష్మీకాంత్ గురువారం తెలిపారు. రెండు దర్గాలు, 38 రూములు, చందాపట్టి, చర్మ సేకరణ, చక్కెర, హెయిర్ కటింగ్ తదితర వాటికి ఏడాది నిర్వహణకు గాను సీల్డ్ టెండరును మే 27 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఆహ్వానించారు. ఆంధ్ర, తెలంగాణ నుంచి మొత్తం 7 సీల్డ్ టెండర్లు దాఖలు కాగా వాటిని గురువారం టెండర్ గడువు ముగిసిన తర్వాత విజయవాడలో ఓపెన్ చేశారు. అత్యధికంగా కోట్ చేసిన లక్ష్మీకాంత్ నిర్వహణ హక్కులను దక్కించుకున్నారు. వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్వహణ గడువును తెలిపి దర్గాలను స్వాధీనం చేసిన తర్వాత తాము బాధ్యతలు తీసుకుంటామని లక్ష్మీకాంత్ తెలిపారు.